# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 7, ఫిబ్రవరి 2026


## అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు దరఖాస్తుల స్వీకరణ



● జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**

అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కె.హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వెబ్ సైట్ అక్రిడిటేషన్ మాడ్యూల్ ప్రారంభించడం జరిగిందని, 202628 సంవత్సరానికి గాను అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. మీడియా యాజమాన్యాలు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కొరకు తమ ప్రతినిధుల పేర్లను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పంపించాలని, అట్టి జాబితాలో ఉన్న అభ్యర్థుల సంబంధిత వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ నుండి సమర్పించాలని తెలిపారు.



## రాష్ట్రంలో మళ్ళీ వచ్చేది కేసీఆర్ సర్కారే

✤ మంచిర్యాల జిల్లా నస్పూర్ కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ నేత హరీష్‌రావు



**నస్పూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

రాష్ట్రంలో మళ్ళీ రాబోయేది కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత తన్నీరు హరీష్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులు చేసిన సమ్మెతో ఢిల్లీ దద్దరిల్లిందని మిగతా 2లో..



### బెల్లంపల్లి నియోజకవర్గాన్ని

## 500 కోట్లతో అభివృద్ధి చేస్తా

✧ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వినోద్ వెంకట్ స్వామి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో 500 కోట్లతో సమగ్ర అభివృద్ధి చేస్తానని శుక్రవారం రోజున మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి 29,30,31,32 వార్డులలో ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి నిధుల కొరత ఉండదని, బెల్లంపల్లిని అన్ని రంగాల అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే 19 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను శంకుస్థాపన చేసి మిగతా 2లో..

## నేడు కాగజ్‌నగర్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రాక

✳ సభాస్థలిని పరిశీలించిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు మున్సిపల్ ఎన్నికల ప్రచార నిమిత్తం మహారాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు దేవేంద్ర ఫడ్నవిస్ శనివారం రానున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. మధ్యాహ్నం మిగతా 2లో..





### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో

## పురోగతి సాధించాలి

❖ జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**

నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకాష్ రావు లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ మిగతా 2లో..

## ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

★ జిల్లా ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :**



రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి పట్టణంలోని ప్రధాన విధుల గుండా ఎస్పీ పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూఈ మునిపల్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోనేల వారిలో భరోసా కల్పించటానికి పట్టణంలో సుమారు 60 మంది పోలీస్ సిబ్బందితో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన్నట్లు తెలిపారు.ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా మిగతా 2లో..

## నేడు కాగజ్‌నగర్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రాక

(మొదటిపేజీ తరువాయి)

12 గంలకు పట్టణంలోని ఎస్పీయం క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారని అన్నారు. సభాస్థలాన్ని శుక్రవారం సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాగజ్‌నగర్ ప్రజలు మార్పు కోరుతున్నారని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాషాయ జెండా వైపు చూస్తున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార నిమిత్తం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కాగజ్ నగర్ పట్టణానికి విచ్చేస్తున్నారని, ప్రతి వార్డు నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సభ ద్వారా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు విజయ సంకల్పాన్ని ప్రకటించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇండ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. మొదటి విడతలో 9057 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 7757 ఇండ్ల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయని, మిగతా 1300 ఇండ్ల పనులు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పైలెట్ గ్రామాలలో ఇండ్లను మంజూరు చేసి సంవత్సరం పూర్తయిందని, మార్చ్ 31వ తేదీ వరకు పనులు ప్రారంభించని ఇండ్లను రద్దు చేయాలని, వివిధ దశలలో ఉన్న పనులను వేగవంతం చేసి మార్చిలో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, లబ్ధిదారులు ఇసుకను సద్వినియోగం చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇంకా పనులు ప్రారంభం కానీ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధార్ సరిగా లేకపోవడం, సాంకేతిక సమస్యలు, అటవీ సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రతి వారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో బిల్లు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ మండలాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలను సమర్పించాలని సూచించారు. వచ్చే వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన చేతి పంపులు, బోరు బావులు, పైప్ లైన్ల మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి నియోజకవర్గాన్ని 500 కోట్లతో అభివృద్ధి చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించామని, 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. గత పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేదని, ఆ కాలంలో ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు ఒక్క లబ్ధిదారుకైన అందజేశారా అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, కొత్త రేషన్ కార్డులు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ప్రజల భవిష్యత్తును నిర్ణయించేవని, ప్రజల సమస్యలపై అవగాహన కలిగిన, ప్రజల మధ్య ఉండే నాయకులని గెలిపించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి, తమ వార్డ్ లోని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతోటి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు అభ్యర్థి మేడి పున్నం చంద్, 30వ వార్డు అభ్యర్థి గెల్లి విజయలక్ష్మి, 31 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గెల్లి సంధ్య, 32 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నీలి హారిక, 4 వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి పంగ శాంతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి: మంత్రి వివేక్

**రామకృష్ణాపూర్, ప్రభాతవార్త**



క్యాతనపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికలలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం వివేక్ అన్ని వార్డులలో ప్రచారం నిర్వహించి, ఒకటో వార్డు, తారకరామ కాలనీలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ పథకాల సమర్థ అమలుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని ఓటర్లను కోరారు.ఒకటో వార్డు అభివృద్ధి జరగాలంటే తీగల రమేష్ చేయి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి, క్యాతనపల్లి పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, స్థానిక నాయకుడు మహంకాళి శ్రీనివాస్, మందమర్రి పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, సోతుకు సుదర్శన్, నీలం శ్రీనివాస్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, ఓడ్నాల శ్రీనివాస్, నెరువట్ల శ్రీనివాస్, ఎర్ర రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మళ్ళీ వచ్చేది కేసీఆర్ సర్కారే..

(మొదటిపేజీ తరువాయి)

గుర్తు చేశారు. ఎంతో మంది అమరవీరుల బలిదానాలు, త్యాగాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని వివరించారు. 200 రూపాయల పెన్షన్ ను 2000 రూపాయలకు పెంచి ఆసరాగా నిలిచామని చెప్పారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయని హరీష్ రావు కొనియాడారు. 30 ఏళ్ల మంచిర్యాల జిల్లా ఆకాంక్షను కేసీఆర్ సాకారం చేశారని గుర్తు చేశారు. జిల్లాకు మెడికల్ కాలేజీతో పాటు అద్భుతమైన కలెక్టరేట్ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. సింగరేణిని అద్భుతంగా తీర్చిదిద్దడమే కాకుండా, కారుణ్య నియామకాలు అమలు చేసి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపినట్లు తెలిపారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న 3200 మందికి పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో 1,67,000 ఉద్యోగాలు కల్పించడంతో పాటు 1000 గురుకుల పాఠశాలలను ప్రారంభించినట్లు వెల్లడించారు. రెండున్నరేళ్ల పాలనలో రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు 2500 రూపాయలు, వృద్ధులకు 4 వేల పెన్షన్, యువతులకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, నిరుద్యోగ భృతి ఊసే లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాతాళానికి పడిపోయాయని విమర్శించారు. బీఆర్ఎస్ కు అధికారం ముఖ్యం కాదని, ప్రజల క్షేమమే ముఖ్యమని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ మ్యాచ్ పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పాల్గొన్నారు. వారితో పాటు నాయకులు విజిత్ రావు, అక్కూరి సుబ్బయ్య, వంగ తిరుపతి, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ అభ్యర్థులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## తిర్యాని ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ డిసిహెచ్

**తిర్యాని, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త:**



తిర్యాని మండల కేంద్రంలోని సిహెచ్‌సి ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం ఆసిఫాబాద్ డిసిహెచ్ (జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్) అవినాష్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలను అలాగే పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాల పరిశుభ్రంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యశాలలో పనిచేస్తున్న పేషంట్ కేర్, సిబ్బందికి వృత్తి మెలకువలను నేర్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణ, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన కృషి సఖీలు

**తిర్యాని, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త**

జాతీయ పకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా కృషి సచల ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా తిర్యాని మండలంలోని చింతలమాదరలోని గీతా మందిర్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని అలాగే గుడిపేటలోని జీవ ఎరువుల వనరుల కేంద్రాలతో పాటు పెందుర్ లక్ష్మి యొక్క సమగ్ర పకృతి వ్యవసాయ క్షేత్రాన్ని కృషి సఖీలు శుక్రవారం సందర్శించారు. అనంతరరం సమావేశాన్ని నిర్వహించి వివిధ పంటల వైద్యత, మిశ్రమ పంటలు, సరిహద్దు పంటలు, పండ్ల మొక్కలు, పూల మొక్కలు గురించి వివరించడం జరిగింది. అనంతరం గుడిపేటలోని జీవ ఎరువుల వనరుల కేంద్రాన్ని సందర్శించి జీవామృతం అగ్ని అస్త్రం ఘనజీవా మృతం నీమాస్త్రం యొక్క ప్రత్యక్ష తయారీ పద్ధతిని నేర్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ టెక్నికల్ అధికారిణి దీప్తి, తిర్యాని వ్యవసాయ అధికారి వినయ్ రెడ్డి, ఏఈఓలు సాగర్, అరణ్య శాశ్వత వ్యవసాయ శిక్షణ సంస్థ నోడల్ అధికారులు సుమన్ కుమార్, సేడం కిరణ్, శివరాజ్, పవన్, సాయికిరణ్, సుప్రియ, రైతు శిక్షకుడు ఆనందరావు, పాల్గొన్నారు.

## ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించుకోవాలని, ఎక్కడైనా సమస్యాత్మక ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎస్ హెచ్ ఓ బాలాజీ వరప్రసాద్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ప్రత్యేక బాలగాలు పాల్గొన్నాయి.



## మౌలిక సదుపాయాల కల్పనే బీజేపీ లక్ష్యం

### - ఇంటింటా ముమ్మర ప్రచారం నిర్వహించిన డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :**

వార్డులోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు, తాగునీటి సమస్య పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనే బీజేపీ లక్ష్యమని బీజేపి సీనియర్ నాయకుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని 7వ వార్డులో ఇంటింటా ముమ్మరంగా ప్రచారం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే స్థానికంగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని సంజీవయ్య కాలనీలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన 7వ వార్డు అభ్యర్థి మిట్టపల్లి కమలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో రన్వీర్ బిస్వాస్, చిపకుర్తి శ్రీనివాస్, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చిన సర్పంచ్

**వేమనపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

ఎన్నికల ముందు గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వేమనపల్లి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ గా వుప్పలపు సాయికృష్ణ నాలుగు బోర్ లు వేయించారు. శుక్రవారం నాడు డిఎంఎఫ్‌టి నిధుల నుండి మంజూరైన త్రాగునీటి బోర్లను మాజీ జెడ్పీటిసి ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ చేతుల మీదుగా త్రాగునీటి బోర్లకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు నీటి సమస్య తలెత్తకుండా బోరు వేయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆరు బోర్‌లు హామీ ఇవ్వగా నాలుగు బోర్‌లు వేయడం జరిగిందని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, కుర్రు వెంకటేశం, తోకల రాంచందర్, గాలి మధు, జహీద్ అలీ వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.





## అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన కిష్టాపూర్ సర్పంచ్

**జన్నారం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ వాసాల నరేష్ సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలు, రికార్డులను పరిశీలించారు. పిల్లల ఆరోగ్యం పోషణ విద్యా అంశాలపై అంగన్వాడి సిబ్బంది స్వరూప, అనితలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో మమేకమై వారి చదువు ఆహారం గురించి ప్రశ్నలు అడిగి ప్రోత్సాహం అందించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.



## ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా..

**- లక్షెట్టిపేట 14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి అడ్డగూరి రమేష్**

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించి అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని లక్షెట్టిపేట 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి అడ్డగూరి రమేష్ కోరారు. శుక్రవారం రోజున ఆయన 14వ వార్డులో కార్యకర్తలతో పాటు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధితో పాటు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పట్టణంలో చేసిన అభివృద్ధిని ఓటర్లకు తెలుపుతూ ప్రచారం నిర్వహించారు. తనపై నమ్మకంతో వార్డు అభివృద్ధికి ఎమ్మెల్యే వార్డు కౌన్సిలర్గా అవకాశం ఇచ్చారని ఈనెల 11న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రమేష్ వేడుకున్నారు. గెలిచిన వెంటనే వార్డులోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## చంద్రవెల్లిలో గ్రామ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో గ్రామ సంఘాల భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం డిఎంపి నీలతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గజేల్లి రాజకుమార్, వార్డు సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి దామోదర్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కంపల చందు, కాంగ్రెస్ నాయకులు పూదరి గణేష్, ఎండి రియాజ్, రాచకొండ శంకర్, జాడి స్వామి, గడ్డం శేఖర్, కళ్యాణం శంకర్, ఏపీఎం విజయలక్ష్మి, సీసీలు అంజలి, గ్రామైక్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్య లతో కలిసి 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఒక బృందానికి 1 పి.ఓ., 1 ఎ.పి.ఓ., 3 ఓ.పి.ఓ. ల చొప్పున బెల్లంపల్లి మున్సిపాలిటీకి 68 బృందాలు, చెన్నూరు మున్సిపాలిటీకి 36 బృందాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీకి 45 బృందాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి 30 బృందాలు, మంచిర్యాల నగరపాలక సంస్థకు 265 బృందాలు రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన స్థానాలలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం బెల్లంపల్లిలో మున్సిపల్ కార్యాలయంలో, చెన్నూర్ లో మున్సిపల్ కార్యాలయంలో, లక్షెట్టిపేటలో మున్సిపల్ కార్యాలయంలో, క్యాతనపల్లిలో మున్సిపల్ కార్యాలయంలో, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 8, 9 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగం కోసం ఫారం 12, ఓటరు ఎపిక్ కార్డ్ తీసుకువెళ్లవలసి ఉంటుందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా..

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికల్లో ఒకటో వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థి గా పోటీ చేస్తున్న ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తానని స్వతంత్ర అభ్యర్థి గంగరాజు అభ్యర్థించారు. వార్డ్ లో ఇంటింటికీ తిరిగి ఓటర్లను వేడుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, తనకు కేటాయించిన బ్యాట్ గుర్తు కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న ఏఓ నాగరాజు

## సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

**బెజ్జూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని రైతులు సబ్సిడీ వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ నాగరాజు తెలిపారు.సబ్సిడీపై హాఫ్ కేజీ వీల్,9 టైన్ కల్టివేటర్,12 డిస్క్ హారో,2ఎంబి ప్లౌ,11 టైన్ కల్టివేటర్,పవర్ టిల్లర్,రోటవేటర్,తైవాన్ స్ప్రేయర్,పవర్ వీడర్ మొదలగు పరికరాలు లభిస్తాయని తెలిపారు.ఎస్సీ ఎస్టీ మహిళలకు 50 ,జనరల్ వారికి 40 సబ్సిడీ ఉంటుందని తెలిపారు.కావలసిన రైతులు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఇట్టి అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అభ్యర్థులు ఖర్చులను స్పష్టంగా నమోదు చేయాలి

**- మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో పోటీలో ఉన్న అభ్యర్థులతో వ్యయ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీల కొరకు ముందస్తుగా అనుమతి పొందాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఖర్చులను నమోదు చేసి వివరాలను నిర్దిష్ట కాలపరిమితిలో సమర్పించాలని సూచించారు. ప్రత్యేక బ్యాంకు ఖాతా నిర్వహణ, రికార్డుల సంరక్షణ, ఖర్చుల పరిమితులపై సమగ్ర అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఖర్చుల పరిమితిని అధిగమించినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ నోడల్ అధికారి నదీమ్ ఖుద్దుసి, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ గజానన్, మాస్టర్ ట్రైనర్ ఊశన్న, ఎన్నికల విభాగం అధికారులు, పోటీలో ఉన్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్

# మానవ మనుగడకు సేంద్రియ సాగే ఉత్తమం

## రసాయన ఎరువులతో జీవకోటికి ప్రమాదం - కృషి సఖి శిక్షణ కార్యక్రమంలో డీఏఓ ఈ. సురేఖ వాక్య

**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 6, ప్రభాతవార**

భవిష్యత్తులో మానవ మనుగడ కొనసాగాలంటే సేంద్రియ వ్యవసాయ సాగుతోనే అది సాధ్యమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారిణి ఇ.సురేఖ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం శివలింగపూర్ గ్రామంలోని గోమాత గోశాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం రోజున జిల్లా వ్యవసాయ అధికారిణి ఇ.సురేఖ సందర్శించారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పథకం లో భాగంగా నాలుగు రోజులుగా సాగుతున్న కృషి సఖి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆమె క్షేత్ర సందర్శన కొరకు శివలింగాపూర్ లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో వాడే నీమాస్త్రం, అగ్నాస్త్రం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య, వేప నూనె లాంటివి ప్రకృతిలో లభించే మొక్కలు, పండ్లు, గింజలు తదితర వాటితో తయారు చేస్తారని, ఆ ఔషధాలతో పంటలు పండించినట్లతే మనుషులకే



కాకుండా జీవకోటిపై ఎలాంటి దుష్ప్రభావం ఉండదని ఆమె పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయం చేయడం వలన కలిగే లాభాలు, రసాయనాలతో పండించే పంటలపై కలిగే నష్టాల గురించి ఆమె శిక్షణలో వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూసారం బాగా పెరిగి నేల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని, నేలకు మేలు చేసే బ్యాక్టీరియా, మిత్ర పురుగులు పెరుగుతాయని తెలిపారు. రసాయన రహిత పంటలు పండించి తినడం వలన మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆమె సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో కృషి సఖి పాత్ర చాలా గొప్పదని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ డివిజన్ సహాయ సంచాలకులు బి.ప్రసాద్ జిల్లా సాంకేతిక వ్యవసాయ అధికారి బానోత్ తరుణ్, చెన్నూర్ మండల వ్యవసాయ అధికారి కె.యామిని, కేవీకే శాస్త్రవేత్త ప్రియ సుగంధిని, గోమాత గోశాల నిర్వాహకుడు గోనె సతీష్, ఆయా గ్రామాల కృషి సఖి రైతులు, చెన్నూరు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పి.అర్చన, ఎమ్.రాజశేఖర్ పాల్గొన్నారు.



## 9వ వార్డులో బీజేపీ ఇంటింటి ప్రచారం

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ 9వ వార్డులో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి రఘునాథరావు ఆదేశాల మేరకు బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు, తగరపు గంగన్న, పార్టీ అభ్యర్థి ముష్కం గంగన్న తో కలిసి వార్డులోని ఇంటింటికి బిజెపి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిజెపి బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, వార్డు అభివృద్ధి కొరకై సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి అభ్యర్థి గంగన్న, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

### - స్వప్న హత్య బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

ఇటీవల హైదరాబాదులోని మొయినాబాద్ లో న్యాయవాది స్వప్నను హత్య చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త కోర్టుల విధుల బహిష్కరణలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిఫ్ కోర్టు లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రధాన ద్వారం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకెం శివకుమార్, ప్రధాన కార్యదర్శి చేను రవికుమార్, సీనియర్ మహిళా న్యాయవాది నల్లుల సంగీత లు మాట్లాడారు. ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాద రక్షణ బిల్లును తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పై జరుగుతున్న హత్యలు ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లగ్గిశెట్టి రాము, సునీల్, సంతోష్, వెంకటేష్, లావణ్య, జాడి రాజేష్, మురళి, శ్రావణ్, ఎండి జుబేర్, సందీప్ మద్దిబోయిన శ్రీనివాస్, దాసారపు రాజు పాల్గొన్నారు.



## మహిళ మెడలో నుంచి రెండు తులాల పుస్తెలతాడు చోరీ

**జన్నారం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

జన్నారం మండలం తపాలాపూర్ గ్రామంలో మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారం పుస్తెలతాడు చోరీ జరిగిన సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి, ఈ నెల 5వ తేదీ బుధవారం రోజు తపాలాపూర్ గ్రామానికి చెందిన రామటెంకి లావణ్య, తన భర్త రాజన్న, కూతురు ఆరాధ్య కలిసి రాత్రి భోజనం చేసి పడుకున్నారు. సుమారు రాత్రి మూడు నుంచి నాలుగు గంటల మధ్యలో ఎవరో ఇంటి ముందు రేకులు కొట్టినట్లు శబ్దం వినిపించగా భర్త రాజన్న పక్షవాతంతో మంచంలో పడుకునే ఉండగా లావణ్య వెళ్లి తలుపు తీసి బయటకు రాగానే అక్కడే మాట వేసిన గుర్తు తెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ పెట్టుకొని తాను తెచ్చుకున్న కారంపొడి కళ్ళలో చల్లి చేతులతో కొట్టి మెడలో గల సుమారు రెండు తులాల బంగారం పుస్తెలతాడు లాక్కుని పారిపోయాడు. ఈ విషయమై జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జన్నారం ఎస్సై గొల్లపెల్లి అనూష మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళాను ఐటీఐ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**జన్నారం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహి స్తున్న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ బండి రాములు తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీ సోమవారం రోజు జన్నారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మేద సర్వే డ్రైవ్, జాన్ డియర్, ఆదర్శ మోటార్స్ వంటి పలు ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగుతుందని ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనే విద్యార్థులు వారి యొక్క అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్ కాపీలు కూడా తీసుకుని రావాలని ఆయన సూచించారు.

## శివాజీ విగ్రహం స్థాపన కొరకు 5516 రూపాయల విరాళం

**జన్నారం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

జన్నారం మండలం చర్లపల్లి గ్రామంలో శివాజీ విగ్రహం స్థాపన కొరకు మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో 5516 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున యాదవ సంఘం అధ్యక్షులు గొర్రె మహేష్, ఉపాధ్యక్షులు మేకల రమేష్, సభ్యులు పాలకాల వెంకటేష్, మేకల రాజన్న, గుడ్ల శ్రీధర్, పాలకాల మహిపాల్, గొర్రె శేఖర్, గొర్రె మధుకర్, మేకల సత్తన్న, జంగం దుబ్బయ్య, మేకల సురేష్, రెంకల సత్తన్న తదితరులు పాల్గొన్నారు.





## నేరడిగొండలో హోరెత్తిన రక్తదాన శిబిరం

**నేరడిగొండ, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త:**

జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా మలుచుకుని నేరడిగొండ మండలం ధార్మిక్‌నగర్ గ్రామస్థులు ఆదర్శంగా నిలిచారు. రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు, మిత్రులు శుక్రవారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాతలు ఉత్సాహంగా పాల్గొని మొత్తం 42 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ, ప్రతి ఏటా తన పుట్టినరోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అభిమానుల ఆప్యాయత తనపై బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవలు చేసేందుకు ఇది ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## నిర్మల్ పురపోరు.. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పత్తిరెడ్డి ప్రచారం

**సారంగాపూర్, ఫిబ్రవరి 06 ప్రభాతవార్త:**

నిర్మల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ వేగం పెంచింది. మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి గురువారం 22, 36, 37, 38 వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ముఖ్యంగా బుధవారుపేట్, పింజారిగుట్ట, ఎస్సీ, వైఎస్సార్ కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల వంటి సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే వార్డుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన పెట్రోల్ బంకు ప్రారంభించిన తహసీల్దార్

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**

మండలంలోని కర్జెల్లి గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన రాధ కృష్ణ పిల్లింగ్ స్టేషన్ (ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్) ను తహసిల్దార్ వెంకటేశ్వరరావు, సర్పంచ్ నారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోల్ బంకు అందుబాటులోకి రావడం వల్ల స్థానిక వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు. నాణ్యమైన ఇంధనాన్ని అందించి వినియోగదారుల నమ్మకాన్ని పొందాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో డీలర్ శ్రీధర్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న తహసిల్దార్ వెంకటేశ్వరరావు



కొలువులు సాధించిన యువకులను సన్మానిస్తున్న ఎస్సై, పోలీస్ సిబ్బంది

### కలల నుంచి కర్తవ్యానికి...

## కేంద్ర బలగాల్లో కొలువులు

**- యువకులను సత్కరించిన ఎస్సై అనిల్ కుమార్**

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :**

గ్రామాల్లోని యువతకు ప్రేరణగా నిలిచేలా ఇటీవల వెలువడిన కేంద్ర బలగాల నియామక ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన, పెంచికల్ పేట్ మండలంలోని ఐదుగురు యువకులు తమ గ్రామాలకు గర్వకారణంగా మారారు. ఈ సందర్భంగా వారిని ఎస్ఐ అనిల్ శుక్రవారం కుమార్ శాలువాలతో సన్మానించి అభినందించారు. పోతేపల్లి గ్రామానికి చెందిన ఎలకరి రాజశేఖర్ సీఐఎస్ఎఫ్ లో, ఎల్లూరు గ్రామానికి చెందిన దుర్గం కిరణ్ సీఆర్పీఎఫ్ లో, అదే గ్రామానికి చెందిన దుర్గం చిరంజీవి, పులుగాం ప్రవీణ్, రౌతు సంతోష్ లు సీఎస్ఎఫ్ లో ఎంపికయ్యారు. కేంద్ర బలగాల్లో కొలువులు సాధించిన ఈ యువకుల కృషి పట్టుదల పలువురికి ఆదర్శంగా నిలిస్తోంది. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ యువకులు వీరిని ఆదర్శంగా తీసుకొని లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకొని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అసాధ్యం కాదని అన్నారు. ప్రభుత్వ కొలువులు సాధించాలనే పట్టుదలతో ఉన్న యువతకు తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ కానిస్టేబుల్స్ శ్రీకాంత్, శ్యామ్ పాల్గొన్నారు.

## టెండల్ అండర్‌గ్రౌండ్-సర్ఫేస్ పోస్టులకు ప్రాక్టికల్ టెస్ట్

**- మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో నిర్వహించిన కమిటీ సభ్యులు**

**మందమర్రి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియా సింగరేణి వర్క్‌షాప్‌లో టెండల్ అండర్‌గ్రౌండ్, సర్ఫేస్ కేటగిరీ-04 పోస్టులకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలను బుధవారం నిర్వహించారు. ఈ పరీక్షలను కమిటీ సభ్యులైన ఎస్.ఓ.టు జీఎం జీ.ఎల్. ప్రసాద్, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జి, డీజీఎం పర్సనల్ సి.హెచ్. అశోక్, డీజీఎం ఐఈడీ కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో క్రమబద్ధంగా నిర్వహించారు. టెండల్ అండర్‌గ్రౌండ్ విభాగంలో మొత్తం 7 ఖాళీలకు గాను 4 మంది అభ్యర్థులు ప్రాక్టికల్ పరీక్షకు హాజరయ్యారు. అదే విధంగా టెండల్ సర్ఫేస్ కేటగిరీ-04లో 2 ఖాళీలకు గాను 3 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల పనితీరును కమిటీ సభ్యులు నిశితంగా పరిశీలించి, వారి సాంకేతిక నైపుణ్యం, పనిలో అనుభవం, భద్రతా ప్రమాణాలపై అవగాహనను పరీక్షించారు. ప్రాక్టికల్ టెస్ట్ సందర్భంగా పారదర్శకత, నిబంధనల పాటింపు, న్యాయసమ్మతమైన ఎంపిక ప్రక్రియకు సింగరేణి యాజమాన్యం అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని అధికారులు తెలిపారు. అర్హత, ప్రతిభ ఆధారంగా ఉత్తమ అభ్యర్థులను ఎంపిక చేస్తామని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ పరీక్షల నిర్వహణతో మందమర్రి ఏరియాలో ఖాళీగా ఉన్న టెండల్ పోస్టుల భర్తీ ప్రక్రియ మరింత ముందుకు సాగిందని, తద్వారా ఉత్పాదకతతో పాటు భద్రతా ప్రమాణాలు మరింత బలోపేతం అవుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు.



# డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలించిన డీసీపీ

**హాజీపూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల లోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాన్ని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ఎన్నికల నిబంధనలకు లోబడి పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్, ఎస్సై కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



# శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా సప్తశక్తి సంగం, మాతృ సమ్మేళనం

**మందమర్రి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శుక్రవారం సప్తశక్తి సంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కట్ట శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. సప్తశక్తి సంగాన్ని మాతృ సమ్మేళనంగా అభివర్ణిస్తారు. ఆర్.ఎస్.ఎస్. స్థాపనకు వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, శ్రీ సరస్వతి శిశు మందిర్ కళ్యాణిఖని పాఠశాలలో మాతృమూర్తుల సమ్మేళనంగా సప్తశక్తి సంగం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా బెల్లంపల్లి నుంచి కొత్తపెల్లి సమత, ఇందూరు భాగ్యలక్ష్మి పాల్గొని స్త్రీశక్తి ప్రాధాన్యతను వివరించారు. మహిళ ఒక మాతృమూర్తిగా, కుటుంబంలోనే కాక సమాజ నిర్మాణంలోనూ తన కర్తవ్యాన్ని ఎలా నిర్వర్తించాలో స్పష్టంగా వివరించి, మాతృమూర్తులకు ఆదర్శంగా నిలిచే విధంగా మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగిస్తూ, స్త్రీ మాతృమూర్తిగా తన బాధ్యతలను నిర్వర్తించడంలో ఆమె పాత్ర ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గోవర్ధనగిరి గీత, గడ్డం విజయలక్ష్మి, దొంతుల పద్మ, బత్తుల సుజాత, తమ్మిశెట్టి మంజులలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా మాతృమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు, పాఠశాల ప్రబంధక మండలి సభ్యులు, ఆచార్యులు, ఉపాధ్యాయుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు ప్రధానోపాధ్యాయురాలు కట్ట శిరీష తెలిపారు.

# వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలి



విద్యుత్ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న వినియోగదారుల ఫోరం చైర్మన్ నారాయణ

**హాజీపూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించి, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పని చేస్తుందని వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. మంచిర్యాల రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక హాజీపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకల నారాయణ మాట్లాడుతూ.. మంచిర్యాల రూరల్ పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల సమస్యలపై నిర్వహించిన పరిష్కార వేదికలో వివిధ గ్రామాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యలపై అర్జీలు అందించారని, మొత్తం 5 అర్జీలు అందగా 2 అర్జీలను వెంటనే పరిష్కరించడం జరిగిందని 3 ఫిర్యాదులు అందించినట్లు తెలిపారు. హాజీపూర్ నుండి ఇంటి పైనుండి ఏ.జి.ఎల్ కరెంట్ లైన్ తీసివేయాలని, నన్నూర్ చెందిన రైతు పంపుల కరెంటు సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, మందమర్రి నుండి నియంత్రిక వల్ల ఇబ్బందులు ఉన్నాయని ఫిర్యాదు చేశారని తెలిపారు. విద్యుత్ సిబ్బందికి బిల్లులు చెల్లించేందుకు డైరెక్ట్‌గా డబ్బులు ఎవరూ ఇవ్వవద్దని, ఆన్లైన్ ద్వారా బిల్లులు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ టెక్నికల్ మెంబర్ ఎస్, రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ ఎస్ సత్యనారాయణ, ఇండిపెండెంట్ మెంబర్ ఎమ్.రాజా గౌడ్, ఎస్.ఈ రాజన్న, డీఈ బి.ఖైజార్, ఏడిఏ రాజశేఖర్, ఏఈలు మహేందర్ రెడ్డి,శ్రీనివాస్, లైన్మెన్లు, లైన్ ఇన్స్పెక్టర్‌లు, అసిస్టెంట్ లైన్మెన్లు సిబ్బంది పాల్గొన్నారు.

